సాక్షి అనంతపురం

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.16,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి.



టీబీ డ్యాంలో 84 టీఎంసీలు

తుంగభద్ర రిజర్వాయర్‌లో 84.761 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 11,777 క్యూసెక్కులు కొనసాగుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.6°/22.9°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

సుస్థిరాభివృద్ధే లక్ష్యం

- సీఎం జగన్ ఆదేశాలతో నియోజకవర్గాల సమీక్ష
- ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యేలకు పూర్తి సహకారం
- వారి అభ్యర్థనల మేరకు అనుమతుల మంజూరు
- పెండింగ్ పనుల పూర్తికి సత్వర చర్యలు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అర్బన్: అన్ని నియోజకవర్గాల్లోనూ సంపూర్ణ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. గురువారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ గౌతమి అధ్యక్షతన కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు అధికారులు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. శాసనసభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో శాసనసభ్యులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందించేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు చేసే క్రమంలో ఉన్న ఇబ్బందులు,



హాజరైన అధికారులు

కొత్తగా అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతుల మంజూరు, నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో ఏవైనా పెండింగ్ ఉంటే సత్వరం పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగిందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి శాసన సభ్యుల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిశీలిస్తామన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సినవి ఇక్కడ జరుగుతాయని చెప్పారు. ఇక ప్రభుత్వం పరిధిలో ఉన్నవాటికి సంబంధించి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి కలెక్టర్ సమర్పిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు నియోజకవర్గాల సమీక్షలు పూర్తయ్యాయన్నారు. రాబోయే రెండు వారాల్లో మిగిలిన ఐదు నియోజకవర్గాల సమీక్ష పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో శాసనసభ్యులందరికీ తప్పనిసరిగా సంతృప్తికరమైన పరిష్కారాలను ప్రభుత్వం చూపిస్తుందన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గడువులోగా పూర్తి చేయాలని కోరారు. పొలాలకు వెళ్లే దారుల పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలన్నారు. హార్టికల్చర్ కింద అర్హత ఉన్న రైతులకు పండ్ల మొక్కలు అందించాలన్నారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలని, 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద ఎమ్మెల్యేలు గుర్తించిన పనులకు వెంటనే ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకోవాలని, పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, భవన నిర్మాణ పనులు గడువులోగా పూర్తి కావాలని, జల్లిపల్లిలో ముంపునకు గురవుతున్న వారికి ఇంటి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, కంబదూరులో రూర్బన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల నిధులు కేటాయించాలి



రూర్బన్ స్కీమ్ కింద కంబదూరు మండలం కేంద్రంలో సీసీ రోడ్ల పూర్తికి రూ.50 లక్షల నిధులు కేటాయించాలి. కళ్యాణదుర్గం పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలి. ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపించాలి. జల్లిపల్లిలో ముంపునకు గురైన వారిలో అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి. కంబదూరు ముస్లిం కాలనీలో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బోరంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. ఈద్గా నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలి. అంబేడ్కర్ భవన్ నిర్మాణం చేపట్టాలి. సమీక్ష సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– కళ్యాణదుర్గం నియోజవర్గ సమీక్షలో మంత్రి ఉషశ్రీచరణ్

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



గుంతకల్లు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. గుత్తి పట్టణంలో తాగునీటి సమస్య ఉంది. ఎంపీఆర్ ద్వారా నీటిని అందించేందుకు సమగ్ర నీటి సరఫరా పథకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి. హెచ్ఎన్ఎస్ఎస్ కింద భూసేకరణ పూర్తి చేసి రైతులకు త్వరగా పరిహారం అందించాలి. ప్రభుత్వ మైనారిటీ బాలికల వసతి గృహం, ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలి. పామిడి పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి. గుంతకల్లు పట్టణంలో ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ప్రధాన రహదారి నుంచి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలి. గుత్తి కోటను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి.

– గుంతకల్లు సమీక్షలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గురుకుల పాఠశాల కోసం భూమి విరాళం



భూమి పత్రాలను డీటీకి అందజేస్తున్న పెద్ద ఓబులేసు దంపతులు

కుందుర్పి: జ్యోతిరావ్‌పూలే బాలుర గురుకుల పాఠశాల నిర్మాణం కోసం కుందుర్పికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ పెద్ద ఓబులేసు తన భూమిని విరాళంగా ఇచ్చారు. అల్లాపురం సమీపంలోని సర్వే నంబరు 58–3బీలోని ఐదెకరాలను కేటాయిస్తూ అందుకు సంబంధించిన పత్రాలను భార్యతో కలిసి శనివారం డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామికి అందజేశారు.

దిగొస్తున్న టమాట ధరలు

అనంతపురం అగ్రికల్చర్: కొద్ది రోజులుగా తారెత్తించిన టమాట ధరలు శనివారం కాస్త తగ్గాయి. క్రమంగా మార్కెట్‌కు సరుకు పెరుగుతుండటంతో ధరలు దిగొస్తున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా కక్కలపల్లి మండీలో 1,000 టన్నుల అమ్మకాల మార్క్‌ను అధిగమించింది. శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.90 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్ ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 1,050 టన్నుల సరుకు అమ్మకానికి రాగా.. వాటిని బహిరంగ వేలం వేశారు. కిలో గరిష్ఠ ధర రూ.90, కనిష్ఠం రూ.55, సరాసరి రూ.73 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయని తెలిపారు.

విధి రాత.. మృత్యు గీత

- కొంప ముంచిన అతివేగం
- చెట్టును ఢీకొని బోల్తాపడిన కారు
- నలుగురు యువకుల దుర్మరణం
- మృత్యువులోనూ వీడని స్నేహం



నుజ్జునుజ్జయిన కారు




మృతులు మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌నాయుడు (ఫైల్)




మృతులు నరేష్‌రెడ్డి, మధుసాగర్‌రెడ్డి (ఫైల్)

తాడిపత్రి : ఆ ఐదుగురు యువకులు ప్రాణస్నేహితులు. కలసిమెలసి తిరిగేవారు. సెకండ్ హ్యాండ్ కారు కొన్నందుకు విందు ఏర్పాటు చేసుకున్నారు. తిరుగుపయనంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. మృత్యువులోనూ కలిసే వెళ్లిపోయారు. మృతుల్లో తాడిపత్రి పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన ఉస్తిల మోహన్‌రెడ్డి (30), నందలపాడుకు చెందిన వెన్నపూస మధుసాగర్‌రెడ్డి (35), మండల పరిధిలోని కడప రోడ్ సాయి నగర్‌కు చెందిన విష్ణువర్ధన్ నాయుడు (24), విజయనగర్ కాలనీకి చెందిన నత్తి బయన్నగారి నరేష్‌రెడ్డి (29) ఉన్నారు. పోరాట కాలనీ యాతం శ్రీనివాసరెడ్డి గాయపడ్డారు.

ప్రమాదం జరిగిందిలా..

మోహన్‌రెడ్డి, మధుసాగర్‌రెడ్డి, విష్ణువర్ధన్ నాయుడు, బయన్నగారి నరేష్‌రెడ్డి, యాతం శ్రీనివాసరెడ్డి పాఠశాల స్థాయి నుంచే స్నేహితులు. అప్పటి నుంచి వీరి స్నేహం కొనసాగుతూనే వచ్చింది. మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం సెకండ్ హ్యాండ్ కారు (ఏపీ02 సీడీ 1513) కొనుగోలు చేశాడు. ఈ సందర్భంగా తన నలుగురు స్నేహితులకూ పార్టీ ఇవ్వాలనుకున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తాడిపత్రి నుంచి కారులోనే యర్రగుంటపల్లి సమీపంలోని ఓ గుట్టపైకి వెళ్లి పార్టీ చేసుకున్నారు. మద్యం తాగి ఎంజాయ్ చేశారు. శనివారం తెల్లవారుజామున తిరుగుపయనంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్ నాయుడు, బయన్నగారి నరేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మధుసాగర్‌రెడ్డి అనంతపురం ఆస్పత్రిలో మృతి చెందాడు. యాతం శ్రీనివాసరెడ్డి గాయాలతో బయటపడ్డాడు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ సీఎం గంగయ్య, రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ పరిశీలించారు. కారులోని వారంతా మద్యం సేవించడంతో పాటు అతి వేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- ఉస్తిల మోహన్‌రెడ్డి ఆటో ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. అవివాహితుడు. తండ్రి విశ్వనాథరెడ్డి గతంలోనే మృతి చెందాడు. తల్లి లత ప్రైవేట్ పాఠశాలలో టీచర్. కుమారుడి మరణ వార్త విని తల్లి హతాశురాలైంది. దేవుడా ఎంత పని చేశావయ్యా అంటూ గుండెలవిసేలా రోదించింది.
- విష్ణువర్ధన్ నాయుడు బీటెక్ వరకు చదువుకున్నాడు. తండ్రి లక్ష్మణరావు ఇదివరకే మృతి చెందాడు. తల్లి జానకి కూలి పనులకు వెళ్లి కుమారుడిని పోషిస్తోంది. ఉద్యోగాన్వేషణలో ఉన్న విష్ణువర్ధన్‌నాయుడు ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో మరణించడాన్ని ఆ తల్లి జీర్ణించుకోలేకపోతోంది.
- కాంతమ్మ, శివరామిరెడ్డి దంపతుల కుమారుడు నత్తి బయన్నగారి నరేష్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. తమ కుటుంబం నిర్వహించే నల్లబండల పాలిష్ పరిశ్రమ వ్యాపార లావాదేవీలను చూసుకుంటుండేవాడు. పార్టీకి వెళ్లి వస్తానని చెప్పి విగతజీవిగా తిరిగిరావడాన్ని చూసి తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు.
- వెన్నపూస మధు సాగర్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడికి భార్య రాణి, మూడేళ్ల, ఏడాదిన్నర వయసు గల కుమార్తెలు శాన్విక, తన్విక ఉన్నారు. మధుసాగర్‌రెడ్డి మృతదేహంపై పడి భార్య, పిల్లలు రోదించారు.
- ఇక ఈ ప్రమాదంలో గాయపడిన యాతం శ్రీనివాసరెడ్డి ఓ పరిశ్రమలో కంప్యూటర్ ఆపరేటర్.

చంద్రబాబును అరెస్ట్ చేయండి

- అసహనంలో పిచ్చెక్కి అరాచకాలు
- విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం
- చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం


గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: ప్రజల్లో ఉనికి కోల్పోవడంతో పిచ్చెక్కి అరాచకాలను ప్రేరేపిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసి, జైల్లో పెట్టాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పుంగనూరులో టీడీపీ శ్రేణుల దుశ్చర్యను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతపురంలోని టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కావాలనే టీడీపీ గుండాలను చంద్రబాబు రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారన్నారు. బీరుబాటిళ్లు, కర్రలు, రాళ్లు, చివరకు గన్ను, బుల్లెట్లతో తరలివచ్చారంటే ఇదంతా ఓ పథకం ప్రకారమే చేయించినట్లు వెల్లడవుతోందన్నారు. గత ఎన్నికల్లో కేవలం 23 సీట్లు గెలిస్తే అందులో ఐదుగురు ఆ పార్టీని వీడారని, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలిచే పరిస్థితులు సన్నగిల్లడంతో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు కుట్ర పన్నినట్లుగా స్పష్టమవుతోందని మండిపడ్డారు. పుంగనూరు ఘటనలో చంద్రబాబును అరెస్ట్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నీచ రాజకీయాలకు తెరలేపిందని మండిపడ్డారు.

పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో ఘోర ఓటమిని ముందే పసిగట్టిన చంద్రబాబు.. ఉద్దేశపూర్వకంగానే అలజడులు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే పుంగనూరులో పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడులు చేయించారన్నారు. అధికారం కోసం నీచ రాజకీయాలకు పాల్పడడం చంద్రబాబు నైజమన్నారు. తక్షణమే హత్యానేరం కింద చంద్రబాబును అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అనంతపురం నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీంఅహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ చైర్‌పర్సన్‌లిఖిత, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, ఇషాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ధనుంజయయాదవ్, నరేంద్రరెడ్డి, పెన్నోబులేసు, అనిల్‌కుమార్‌గౌడ్, శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్‌పీరా, సుధీర్‌రెడ్డి, రంగనాథరెడ్డి, కృష్ణవేణి, రాధాయాదవ్, భారతి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: సెప్టెంబర్ 9న అన్ని కోర్టులలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల కలెక్టర్, ఎస్పీలు, పోలీసు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. పోక్సో బాధితులకు పరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి డీఆర్వో కొండయ్య, అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి ఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన చిన్నారులకు టీకా


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: అర్హత ఉన్న ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ సూచించారు. అక్టోబర్ వరకూ మూడు విడతల్లో జరిగే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. 0–5 ఏళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, గ్రామ, వార్డు సచివాలయాల్లో టీకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకూ, సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకూ, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకూ టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. టీకాల కోసం ఆశ కార్యకర్తల సాయంతో యూవిన్ మొబైల్ అప్లికేషన్‌లో ముందస్తుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ మహేంద్ర, ఆరోగ్య శాఖ సిబ్బంది మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు

అనంతపురం సెంట్రల్: వ్యాసరాయలు 15వ శతాబ్దంలో ప్రతిష్ఠించిన కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవస్థానాలను శ్రావణమాసంలో దర్శించుకోవడానికి హనుమాన్ దర్శన్ పేరిట ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌చార్జ్ ఆర్‌ఎం రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 22, 26, 29 తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 4, 9, 12 తేదీల్లో అన్ని డిపోల నుంచి బస్సులు నడుపుతామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు చార్జీలు ఇలా...

డిపో	పెద్దలకు	పిల్లలకు
అనంతపురం	రూ.600	రూ.300
గుత్తి	రూ.570	రూ.290
గుంతకల్లు	రూ.500	రూ.250
కళ్యాణదుర్గం	రూ.530	రూ.270
రాయదుర్గం	రూ.500	రూ.250
తాడిపత్రి	రూ.700	రూ.350
ఉరవకొండ	రూ.500	రూ.250

ప్రతి విద్యార్థికీ 'ఆల్బెండజోల్'

రాప్తాడు రూరల్: నులి పురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆల్బెండజోల్ మాత్రలను వైద్యశాఖ ఉచితంగా అందజేస్తుందన్నారు. సంబంధిత మునిసిపల్ కమిషనర్, ఎంపీడీఓ కార్యాలయం నుంచి 8వ తేదీనే మాత్రలు తీసుకోవాలన్నారు. అన్ని స్కూళ్లకు అందేలా చూడాల్సిన బాధ్యత ఎంఈఓలదేనన్నారు. విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు ఇవ్వాలన్నారు. మాత్ర తీసుకున్న తర్వాత కనీసం 100 నుంచి 200 ఎంఎల్ నీరు తాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్థానికంగా ఉండే ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

శింగనమల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

- ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- అట్టహాసంగా నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు (చిత్రంలో) ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: శింగనమల మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. బీకేఎస్ మండలం రెడ్డిపల్లి పశు శిక్షణా కేంద్రంలో శింగనమల మార్కెట్ యార్డు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. యార్డు గౌరవ అధ్యక్షురాలుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, చైర్‌పర్సన్‌గా భూమిరెడ్డి సునీత, వైస్ చైర్‌పర్సన్‌గా గీతా, డైరెక్టర్లుగా శివమ్మ, గుజ్జల పుష్పావతి, విజయ్‌కుమార్, విజయలక్ష్మి, బాల సురేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, బంగి జ్యోతి, లక్ష్మీరెడ్డి, గంగాదేవి, శ్రావణి, ఓబిరెడ్డి, నీలం శివశంకరరెడ్డి, అమీర్‌బాషాతో మార్కెట్‌యార్డు కార్యదర్శి కేదార్‌నాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పంట దిగుబడులు అమ్ముకునేందుకు వీలుగా శింగనమల మార్కెట్ యార్డులో మౌలిక వసతులు మెరుగు పరుస్తామన్నారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి దక్కేలా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ రంగయ్య, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డికి నూతన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సీనియర్ టీ20 విజేత 'అనంత'

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీనియర్ టీ20 ఇంటర్ జోనల్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై 78 పరుగుల ఆధిక్యంతో అనంతపురం జట్టు విజయం సాధించింది. అనంత బ్యాటర్ మచ్చా దత్తారెడ్డి అద్భుత ఆట తీరును ప్రదర్శించారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 173 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. దత్తారెడ్డి 50 , వినయ్‌కుమార్ 36, డీబీ.ప్రశాంత్ 34, గిరినాథ్ 23 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు లక్ష్య ఛేదనలో విఫలమైంది. 20 ఓవర్లలో కేవలం 95 పరుగులు మాత్రమే చేసి 9 వికెట్లు కోల్పోయింది. జట్టులో లలిత్‌మోహన్ 33 మినహా చెప్పుకోదగ్గ పరుగులు ఎవరూ చేయలేదు. అనంత బౌలర్లు ప్రశాంత్‌కుమార్ 3 వికెట్లు, మల్లికార్జున, దీపక్, ప్రమోద్‌కుమార్ చొరో రెండు చొప్పున వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా డీబీ ప్రశాంత్‌కుమార్ ఎంపికయ్యారు.

రైతుకు తోడుగా ప్రభుత్వం

- 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు


డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, విప్ కాపు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అన్ని విధాలా తోడుగా నిలుస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అందులో భాగంగా 90 శాతం సబ్సిడీపై రైతులకు డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో కలిసి ఆయన కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలోని రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు ధ్యేయంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి 2023–24 ఆర్థిక సంవత్సరంలో తొలివిడతగా 306 హెక్టార్లకు సంబంధించి రూ.2.59 కోట్లు విలువ చేసే డ్రిప్ పరికరాలకు రూ.2.12 కోట్ల సబ్సిడీతో అందిస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2,696 హెక్టార్లకు సంబంధించి రూ.19.86 కోట్లు విలువ చేసే డ్రిప్ పరికరాలను రూ.16.03 కోట్ల సబ్సిడీతో అందించామన్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తొలివిడతగా 750 హెక్టార్లకు సంబంధించి రూ.1.96 కోట్ల విలువ చేసే డ్రిప్ పరికరాలను రూ.1.55 కోట్ల సబ్సిడీతో రైతులకు అందజేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 919.45 హెక్టార్లకు సంబంధించి రూ.6.92 కోట్ల విలువ చేసే పరికరాలను 5.33 కోట్ల సబ్సిడీతో అందించామన్నారు. ప్రతి అంశంలోనూ రైతులకు మేలు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఏపీడీ ఫజులున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఓ చీడపురుగు

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: రాష్ట్రానికి ఓ చీడ పురుగులా చంద్రబాబు మారారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. శనివారం విడపనకల్లులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా పుంగనూరు, అంగళ్లలో చోటు చేసుకున్న అల్లర్లకు చంద్రబాబునే కారణమన్నారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తూ టీడీపీ గుండాలను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారన్నారు. ఇదంతా చూస్తుంటే బాబు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శన ఓ బూటకమని తేలిపోతోందన్నారు. కేవలం అలజడులు సృష్టించి రాష్ట్రంలో తన ఉనికి చాటుకునేందుకు చంద్రబాబు ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్నారు. 14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించినా ఒక్క ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయలేని అసమర్థుడిగా చంద్రబాబు మిగిలారన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనతో ప్రజల్లో పూర్తిగా ఉనికి కోల్పోయిన చంద్రబాబు అల్లర్లకు కుట్ర పన్ని రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ పాలన దేశానికి ఒక రోల్ మోడల్‌గా మారిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా ఎదుర్కొలేక అంగళ్లు, పుంగనూరులో అలజడులకు కారణమైన చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే టీడీపీని పూర్తిగా భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ కన్వీనర్ బసన్న, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, నాయకులు దేశాయ్ సిద్ధార్థ, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్ జైన్

అనంతపురం అర్బన్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం, రీ–సర్వే, భవన నిర్మాణాలు, తదితరాలపై శనివారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. అనంతరం ఇదే అంశంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన గడవులోపు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలకు నాణ్యమైన సత్వర పరిష్కారం చూపించాలన్నారు. రీ–సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్ పీడీ కేశవనాయుడు, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, ఎస్‌డీసీ శ్రీనివాసులు, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సీఈఓ భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

తనువులు వేరైనా తలపులు ఒకటే


ప్రతి రెండవ శనివారం కలుసుకునే స్నేహితులు

అనంతపురం/కల్చరల్: స్నేహం చేయడం మీ బలహీనత అయితే ప్రపంచంలో మీ అంతటి బలవంతుడు లేడనే సామెతను ఓ ఆంగ్ల కవి అన్నాడు. అరమరికలు లేని బంధం స్నేహమేనన్నది అక్షర సత్యం. కష్టాసుఖాల్లో పాలుపంచుకునే స్నేహం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అలాంటి స్నేహాన్ని పదిలంగా కాపాడుకుంటూ వస్తున్నారు అనంతపురంలోని పొట్టిశ్రీరాములు నగర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1985 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు దశాబ్దాలుగా ప్రతి రెండవ శనివారం స్థానిక కృష్ణకళామందిరంలో కలుసుకోవడం ఆనవాయితీగా చేసుకున్నారు. పూర్వ విద్యార్థులైన చంద్రశేఖర్, మారుతి, జయసింహ, నాగరాజు తదితరులు మాట్లాడుతూ... 35 ఏళ్లుగా తాము ఎన్ని పనులున్నా మానుకుని రెండో శనివారం స్నేహితుల కోసమే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం (నేడు) స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా జరుపుకునేందుకు సన్నాహకాలు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతుడు నాగరాజు

కనగానపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన నాగరాజు(42), అమల దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. అమల తల్లిదండ్రులు పెనుకొండ సమీపంలోని కొగిర గ్రామంలో నివాసముంటున్నారు. పీర్ల పండుగను అత్తారింట్లో వేడుకగా జరుపుకోవాలని నిర్ణయించుకున్న నాగరాజు... శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై భార్యతో కలసి బయలుదేరాడు. మార్గమధ్యంలో మామిళ్లపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో ద్విచక్ర వాహనం పైనుంచి దంపతులిద్దరూ కిందపడ్డారు. నాగరాజు తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అమలను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ గూండాల దాడి

- ఐదుగురు వైఎస్సార్‌సీపీ వర్గీయులకు తీవ్ర గాయాలు


బాధితుడికి చికిత్స చేస్తున్న వైద్యుడు (చిత్రంలో) కేతిరెడ్డి హర్షవర్ధనరెడ్డి

యాడికి: టీడీపీ గూండాలు దాడి చేయడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం బోయరెడ్డిపల్లిలో శుక్రవారం సాయంత్రం టీడీపీకి చెందిన 30 కుటుంబాలు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధనరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం 6 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటశివుడు తన ద్విచక్ర వాహనంలో యాడికి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా.. టీడీపీకి చెందిన లక్ష్మీనారాయణ తన బొలెరో వాహనంతో ఢీ కొట్టాలని వెంబడించాడు. దాడి నుంచి తప్పించుకున్న వెంకటశివుడును చిక్కేపల్లి మలుపు వద్ద తన వాహనాన్ని అడ్డుపెట్టి ఆపి వాగ్వాదానికి దిగాడు. ఎంత మందిని పార్టీలోకి చేర్చుకుంటావంటూ ఘర్షణ పడ్డాడు. చిక్కేపల్లిలో ఉన్న టీడీపీ నాయకులు పెద్దయ్య, లక్ష్మీనారాయణ, కొత్తరాయుడు, శివయ్య, నగేష్, హరికృష్ణ, రామకృష్ణ మూకుమ్మడిగా వెంకటశివుడిపై దాడికి తెగబడ్డారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న బోయరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మారుతి, మంజునాథ, రాజు, వెంకటశివ, నగేష్.. దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో టీడీపీ నాయకులు విచక్షణ కోల్పోయి అందరిపై దాగికి తెగబడడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి, సిబ్బందితో అక్కడకు చేరుకుని టీడీపీ వర్గీయులను చెదరగొట్టి క్షతగాత్రులను వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధనరెడ్డి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

నులిపురుగులతో రక్తహీనత



రాప్తాడులో మాట్లాడుతున్న రాష్ట్రీయ బాల సురక్షా నోడల్ ఆఫీసర్ నారాయణస్వామి

రాప్తాడు: నులిపురుగులతో రక్తహీనత, ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని రాష్ట్రీయ బాల సురక్ష నోడల్ ఆఫీసర్లు నారాయణ స్వామి, మహేంద్ర నాథ్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ (విన్ పోర్టల్) చేసే విధానంపై వివరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న నులి పురుగుల నివారణకు ఏటా ఆగస్టు 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణి, సీహెచ్ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు అరుణ, లక్ష్మీనరసమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ కాపాడదాం



పాఠశాలలో మొక్కలు నాటుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలని సనప ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం అనురాధ తెలిపారు. శనివారం సనప ఉన్నత పాఠశాలలో ఎస్‌కేసీ సేవా సంస్థ ద్వారా పాఠశాలలో వంద మొక్కలు నాటారు. హెచ్ఎం మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సీతారామ్, కమల్‌నాథ్, రాజశేఖర్, కిశోర్, శ్రీదేవి ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. ఉపాధ్యాయులు నాగరాజు, మదన్‌మోహన్, రమణారెడ్డి, ప్రభాకర్, లలిత, కవిత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అనంతపురం రూరల్: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఉషశ్రీ చరణ్‌ను సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షకు హాజరైన మంత్రిని కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

అనుమతి లేని విక్రయాలపై కఠిన చర్యలు



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: అనుమతి లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ విక్రయించేవారిపై చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి హెచ్చరించారు. ఏఓ శశికళతో కలసి శనివారం అనంతపురంలోని రైతుబజార్‌లో ఉన్న ఆంజనేయ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి చెందిన దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్, సేల్స్, రైతు బిల్లులు, లైసెన్సులు, ఇతర డాక్యుమెంట్లు పరిశీలించారు. అనంతరం గోదామును పరిశీలించి రూ.4.32 లక్షల విలువైన అనుమతి లేని వివిధ రకాల డ్రిప్ మందులను గుర్తించి, వాటి అమ్మకాల నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత గడువులోపు అనుమతి పత్రాలు సమర్పించకపోతే వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాలు చేస్తున్న మహిళా భక్తులు



పూజలు చేస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా శ్రీవారి లడ్డూ పడిపూజలు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆలయాలు శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. వైష్ణవాలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్థానిక శారదానగర్‌లోని శ్రీశివ బాలయోగి ఆశ్రమంలో శ్రీవారి లడ్డూ పడిపూజలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు గుప్తా, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో నిలువెత్తు వేంకటేశ్వరుడికి 1008 లడ్డూలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డు, రామ్‌నగర్, శంకర మఠం తదితర చోట్ల ఏడు శనివారాల వ్రతాలు ఘనంగా జరిగాయి. మహిళా భక్తులు బారులు తీరి ఏకరూప దుస్తులతో భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరిస్తావా!

రాప్తాడు: టీడీపీ అధినేత చంద్రబాబుకు దమ్ముంటే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించాలని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 3న ఆత్మకూరుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై చేసిన విమర్శలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. శనివారం రాప్తాడు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, నిరసన తెలియజేశారు. ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక వైఎస్సార్ విగ్రహం దగ్గర నుంచి బస్టాండు సర్కిల్‌కు చేరుకొని చంద్రబాబు నాయుడు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రజలకు సేవ చేస్తున్నారని, అలాంటి నేతపై రూ.2 వేల కోట్లు దోపిడీ చేశాడని చంద్రబాబు నాయుడు విమర్శలు చేయడం సరికాదన్నారు. తాను రూ.2 వేల కోట్లు దోపిడీ చేశానని



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిరూపిస్తే నిరూపించాలని, ఎమ్మెల్యే అయ్యాక సంపాదించిన ఆస్తులు కేవలం రూ.20 కోట్లకే రాసిస్తానని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారని నాయకులు గుర్తు చేశారు. ఎమ్మెల్యే సవాల్‌ను చంద్రబాబునాయుడు స్వీకరించాలన్నారు.

ఉగ్రవాదిలా వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబు..

చంద్రబాబు నాయుడు రాయలసీమ జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చి ఉగ్రవాదిలా వ్యాఖ్యలు చేస్తున్నారని నాయకులు విమర్శించారు. గతంలో ఆయన హయాంలో చేసిన అభివృద్ధి పనులు చెప్పకుండా, రాబోవు ఎన్నికల్లో తాము గెలిస్తే ఏమి చేయాలనేది చెప్పకుండా, ప్రజలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన అభివృద్ధిని జీర్ణించుకోలేక ఉన్మాదిలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులు రూ.20 కోట్లు వెచ్చించి మహిళలకు ఉపాధి కల్పించేందుకు అమ్మ డెయిరీని ఏర్పాటు చేశారన్నారు. తమ పార్టీ అధికారంలోకొస్తే పేరూరు డ్యాంకు నీళ్లు ఇస్తామని చెప్తున్నారు.. తమ పార్టీ అధికారంలో కొచ్చిన తర్వాత నాలుగుసార్లు పేరూరు డ్యాంకు నీరు ఇచ్చామని గుర్తు చేశారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకువచ్చేందుకు రూ. 835 కోట్లకు టెండర్లు పిలిస్తే..రూపాయి ఖర్చు లేకుండా పేరూరు డ్యాంకు నీళ్లు తెచ్చి పంటలు పండించిన ఘనత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిదేనని నాయకులు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, గోవింద్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘బాలిక పెళ్లి’పై కేసు నమోదు

రాప్తాడు రూరల్: బలవంతంగా బాలికకు పెళ్లి చేసిన ఘటనలో పలువురిపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దండోరాకాలనీకి చెందిన బాలిక (16)కు ఇటీవల తన సమీప బంధువుతో తిరుమలలో పెళ్లి చేశారు. బాలికకు తండ్రిలేడు. తాను చదువుకుంటానని వేడుకున్నా బలవంతంగా పెళ్లి చేశారు. ఘటనపై ఆమె చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె తల్లి, వరుడి తల్లిదండ్రులపైన రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

9న అశ్వత్థ క్షేత్రంలో వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఈనెల 9వ తేదీన టెంకాయల విక్రయ హక్కుల కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో టెంకాయల విక్రయ హక్కులు పొందుటకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అన్నమయ్య జిల్లా, చిత్తూరు జిల్లాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన అల్లర్లు, దాడులతో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని, దీనికి కారణమైన చంద్రబాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు బడా నారాయణరెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నారాయణరెడ్డితో పాటు లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల ఆదినారాయణ, లీగల్‌సెల్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర ఆచారి, మల్లేశ్వరరెడ్డి డీఐజీ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తప్పనిసరిగా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకొస్తుందని తెలుసుకొని, అడ్డదారిలో గెలవాలని నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి అల్లర్లు, దాడులకు చంద్రబాబు ప్రేరేపిస్తున్నారన్నారు. చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని వికృత చేష్టలకు దిగుతున్నారన్నారు. రెండు పోలీసు జీపులను తగలబెట్టారన్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో చంద్రబాబు అశాంతిని రేపాడన్నారు. ప్రభుత్వ ఆస్తులు తగలబెట్టి, భారీగా నష్టపరిచిన కారణంగా చంద్రబాబు నాయుడు, టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



చంద్రబాబునాయుడుపై ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

భూసార పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: భూసార పరీక్షలపై ఎస్కేయూ పీజీ కెమిస్ట్రీ (అనలైటిక్ కెమిస్ట్రీ) విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పది రోజుల ప్రాజెక్టులో భాగంగా విద్యార్థుల బృందం స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్-ఎస్‌టీఎల్) ఏడీఏ రోజాపుష్పలత ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శనివారం చివరి రోజు విద్యార్థులతో భూసార పరీక్షలు ప్రయోగాత్మకంగా చేయించారు. వ్యవసాయం, పంట ఉత్పత్తి, ఉత్పాదకశక్తి, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, భావి తరాల మనుగడ కోసం భూసంరక్షణ విధానం, భూమి భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకోవాలన్నారు. మట్టి నమూనాల సేకరణ విధానం, ప్రయోగశాల్లో వాటి విశ్లేషణ, ఫలితాలు, వాటి ఆధారంగా పాటించాల్సిన పోషక యాజమాన్యంపై ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ప్రధానంగా పీహెచ్ (భూమి స్థితి) శాతం ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పొటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం తదితర వాటిపై విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంచేలా అవగాహన కల్పించినట్లు ఏడీఏ తెలిపారు.



ఎస్కేయూ పీజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌టీఎల్ ఏడీఏ రోజాపుష్పలత

విద్యార్థుల్లో ఉన్నత భావాలు పెంపొందించాలి

- ‘నాక్’ చైర్మన్ ప్రొఫెసర్ దామోదర్ మిశ్రా

రాప్తాడు రూరల్: విద్యార్థుల్లో ఉన్నత భావాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) చైర్మన్ ప్రొఫెసర్ దామోదర్ మిశ్రా సూచించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు సాగిన నాక్ బృందం పర్యటన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దామోదర్ మిశ్రా మాట్లాడుతూ... గొప్ప చరిత్ర కలిగిన కళాశాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు నిరంతరం పని చేయాలన్నారు. సభ్యులు రామచంద్ర మోహన్, సుజాత మాట్లాడుతూ.. నీలం సంజీవరెడ్డి లాంటి ఎందరినో వచ్చే వందేళ్లలో తయారు చేయాల్సిన అవసరం కళాశాలకు ఉందన్నారు. ఇందుకోసం అందరూ సమన్వయంగా కృషి చేయాలన్నారు. అనంతరం నాక్ బృందం నివేదికను ప్రిన్సిపల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, నాక్ కోఆర్డినేటర్ అచ్యుతానందకు అందజేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ దామోదర్ మిశ్రా

మెడికల్ పీజీలో సాదియా అరుదైన ఘనత

అనంతపురం క్రైం: మెడికల్ పీజీలో సాదియా సంజీర్ అరుదైన ఘనత సాధించడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అభినందించారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థి సాదియా సంజీర్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ దుర్గ మాట్లాడుతూ బయోకెమిస్ట్రీలో 700 మార్కులకు గాను 526 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలోనే సాదియా సంజీర్ అరుదైన రికార్డు సాధించినట్లు తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థుల్లో యూనివర్సిటీ స్థాయిలో మొదటి బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. సాదియా సంజీర్‌ను మిగితా విద్యార్థులు కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొఫెసర్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ బీఆర్ శ్యాంప్రసాద్, వైద్యులు డాక్టర్ రేవతి, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ హవీలా, డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు డాక్టర్ అమూల్య, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సాజియా సంజీర్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

అనంతపురం సెంట్రల్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ నరసమ్మ, శేషమ్మ తెలిపారు. శనివారం రాణినగర్ 4వ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందించారు.

ఆత్మకూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సింగంపల్లి తండా సర్పంచ్ వెంకటేష్ నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని సింగంపల్లి తండా, మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళాపోలీసులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న దృశ్యం

మాతా శిశుమరణాలపై విచారణ

అనంతపురం క్రైం: నగరంలోని వేర్వేరు ఆస్పత్రుల్లో ఇటీవల జరిగిన మాతా శిశుమరణాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ విచారణకు ఆదేశించారు. స్నేహలత ఆస్పత్రిలో ఓ శిశువు మరణం, రామ్‌నగర్‌లోని శివచైతన్య ఆస్పత్రిలో ఓ మాతృమరణం (ప్రశాంతి)పై విచారణ చేయాలని డీఎంహెచ్ఓ ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ శంషాద్ బేగం, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌తో విచారణ చేయించాలని ఆదేశించారు. ఈనెల 9న బాధిత కుటుంబ సభ్యులు, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాకులను విచారణ కమిటీ విచారించనుంది.

లైన్‌మెన్ సస్పెన్షన్

కణేకల్లు: మండలంలోని బెణికల్లులో ఓ ప్రైవేట్ వ్యక్తి అనధికారికంగా తలపెట్టిన విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌కు సహకరించిన లైన్‌మెన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం డివిజన్ ఈఈ శేషాద్రినాయుడు తెలిపారు. వివరాలు.. బెణికల్లు గ్రామంలో ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చేందుకు స్థానికులతో ఓ ప్రైవేట్ వ్యక్తి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న లైన్‌మెన్ రామాంజనేయులు సాయం తీసుకున్నాడు. అయితే బెణికల్లు విద్యుత్ లైన్ బ్రహ్మసముద్రం గ్రామంలోని సబ్ స్టేషన్ పరిధిలోకి వస్తుండడంతో గత ఆదివారం అక్కడి పనిచేస్తున్న ఆపరేటర్ రాముకు రామాంజినేయులు ఫోన్ చేసి అనధికారికంగా ఎల్‌సీ ఇప్పించాడు. ఇందుకు పోల్ టూ పోల్ వర్కర్ రవి కూడా సహకరించాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచరణ చేపట్టి, వాస్తవాలు నిగ్గుతేల్చారు. ప్రైవేట్ పనులకు అనధికారికంగా ఎల్‌సీ ఇచ్చినట్లుగా నిర్ధారణ కావడంతో రామాంజినేయులను సస్పెండ్ చేశారు. ఇందుకు సహకరించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు రాము, రవిను ఉద్యోగం నుంచి తొలగించాలంటూ సంబంధిత ఏజెన్సీకి సిఫారసు చేశారు. కాగా, బెణికల్లులో ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులను శాఖాపరంగా చేయిస్తామని ఈఈ శేషాద్రి నాయుడు స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేస్తామని భరోసానిచ్చారు.

యూజీ పరీక్షల్లో నలుగురి డిబార్

అనంతపురం: ఎస్కేయూ యూజీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ తెలిపారు. శనివారం పామిడి, గుత్తి, గుంతకల్లు, అనంతపురం పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. గుత్తిలో శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఐదో సెమిస్టర్ పరీక్షల్లో చూసి రాస్తున్న ఇద్దరని, గుంతకల్లులో శ్రీ వెంకటేశ్వర కళాశాల రెండో సెమిస్టర్‌లో చూసి రాస్తున్న ఒకరిని బుక్ చేసినట్లు వివరించారు. అనంతపురం ఎస్ఎల్ఎన్ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు.

నేడు క్రైస్తవుల శాంతి ర్యాలీ

అనంతపురం కల్చరల్: దేశంలో మతపరమైన హింసను నిరసిస్తూ క్రైస్తవులు ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఐక్య క్రైస్తవ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ఐ సంఘకాపరి పాస్టర్ బెన్‌హర్‌బాబు, జీసెస్ కంపాషన్ చర్చి పాస్టర్ మోజెస్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు సీఎస్ఐ చర్చి నుంచి ర్యాలీ ప్రారంభమై కోర్టురోడ్డు గాస్పెల్ హాలు, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్ఐయూ చర్చి వరకు సాగుతుందన్నారు. ప్రతి ప్రార్థనా మందిరం పాస్టర్‌తో పాటు సంఘ సభ్యులు ఐక్యంగా కదిలి వచ్చి ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

పలువురు రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత అమిలినేని సురేంద్రబాబు జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 500 మంది అభిమానులు, సంస్థ సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం రూరల్ పరిధిలోని 17 అనాథ ఆశ్రమాలకు నిత్యావసర సరుకులు అందించారు.

ఉత్సాహంగా ‘ప్రత్యేక’ క్రీడాపోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.సాయిరామ్ తెలిపారు. సమగ్ర శిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్ శనివారం అట్టహాసంగా నిర్వహించారు. అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన కక్రీడా పోటీలను సాయిరామ్ ప్రారంభించి, మాట్లాడారు. సమగ్ర శిక్ష ద్వారా ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక అవసరాల పిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మండలానికో భవిత కేంద్రం ఏర్పాటు చేసి నిపుణులతో ఫిజియోథెరపీ అందిస్తున్నామన్నారు. గాయాలు తగలకుండా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న ప్రత్యేక అవసరాల విద్యార్థుల కళ్లలో కనిపించిన ఆత్మస్థైర్యం వారు అన్ని రంగాల్లో రాణించగలరనే నమ్మకాన్ని పెంపొందిస్తోందన్నారు. అనంతరం 50, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, బోసీ, స్లోవాక్ తదితర పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ పద్మప్రియ, ఎంఈఓ-2 సరితాదేవి, అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్ షమా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: యాడికి మండలం రాయలచెరువుకు చెందిన కంబగొని రాజేంద్రప్రతాప్, ముప్పగొని పద్మిని దంపతుల 45 రోజుల చిన్నారి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి చెందిన బుర్రా ఆదినారాయణ గౌడ్, లక్ష్మీదేవమ్మ రూ.35వేలు ఆర్థికసాయం అందించారు. చిన్నారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.